సాక్షి
విశాఖపట్నం
ఆదివారం, 7, సెప్టెంబర్, 2025



నేత్రపర్వంగా అనంతుని జయంతి 8లో



బోణీ కొట్టిన బుల్స్, జెయింట్స్ 8లో



'కమిటీ కుర్రాడి'కి సైమా అవార్డు 8లో

బయో మైనింగ్‌లో నిజాలకు పాతర!

- నకిలీ సర్టిఫికెట్‌తో టెండర్ దక్కించుకున్నట్టు ఆరోపణలు
- అర్హత పత్రం సరైనదో కాదో కూడా నిర్ధారించుకోని జీవీఎంసీ
- నేరుగా రూ.2 కోట్ల బిల్లుల చెల్లింపులకు రంగం సిద్ధం
- పాత తేదీలతో కమిషనర్ ముందుకు ఫైలు
- కమిషనర్‌నూ ఇరికించేందుకు పన్నాగం!





కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డు (ఇన్‌సెట్‌లో) అగర్తలా మున్సిపాలిటీలో పనిచేసినట్టు సంస్థ సమర్పించిన పత్రం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

కాపులుప్పాడలోని బయో మైనింగ్‌లో జీవీఎంసీ అధికారులు నిజాలను పాతరేస్తున్నారు. ఇక్కడ బయో మైనింగ్ ప్రక్రియ చేపట్టామంటూ రూ.2 కోట్లు కాజేసేందుకు పాత తేదీలతో బిల్లులను కమిషనర్‌కు సమర్పించారు. సుమారు 8 నెలల క్రితం పని పూర్తయినట్టు చెబుతున్న అధికారులు.. ఇప్పుడు ఫైలును కదుపుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వంద ఎకరాల్లో విస్తరించి ఉన్న కాపులుప్పాడలోని డంపింగ్ యార్డులో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బయో మైనింగ్ ప్రక్రియ చేపట్టారు. తద్వారా 25 ఎకరాల భూమిని తిరిగి వినియోగించుకునేందుకు అనుకూలంగా తయారుచేశారు. మిగిలిన భూమిలో కూడా బయో మైనింగ్ చేపట్టాలంటూ కూటమి ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లతో టెండర్‌ను పూర్తి చేశారు. ఈ టెండర్‌ను దక్కించుకునేందుకు సదరు సంస్థ సమర్పించిన అనుభవ పత్రంపైనా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు పని జరిగిందా? లేదా అనేది కూడా అధికారులు పరిశీలన చేయకుండానే ఏకంగా రూ.2 కోట్ల బిల్లుల చెల్లింపుల కోసం 8 నెలల తర్వాత పాత తేదీలతో కమిషనర్ అనుమతికి పంపించారు. బిల్లుల చెల్లింపుల ద్వారా కమిషనర్‌ను కూడా ఇందులో ఇరికించాలనే ఆలోచనలో కిందిస్థాయి జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జెన్యూనిటీ చెక్ ఏదీ?

వాస్తవానికి ఏదైనా సంస్థ ఫలానా వద్ద పనిచేశానంటూ టెండర్ దాఖలు చేసే సమయంలో అర్హత పత్రాన్ని జత చేయడం సహజం. ఇక్కడ బయో మైనింగ్ పేరుతో రూ.2 కోట్ల పనులకు కూడా సదరు సంస్థ త్రిపుర రాష్ట్రంలోని అగర్తలా మునిసిపాలిటీలో పని చేసినట్టు అర్హత పత్రాన్ని సమర్పించింది. ఈ అర్హత పత్రంపై అగర్తలా కమిషనర్ సంతకం కూడా చేశారు. అయితే, సంతకం కింద ఎక్కడా స్టాంపింగ్ మాత్రం వేయలేదు. తమ వద్ద ఫలానా సంస్థ... ఫలానా పనిచేసిందని చెబుతూ ఇచ్చే సర్టిఫికెట్‌పై సహజంగా ఇంజనీర్ల సంతకాలు ఉంటాయి. ఇక్కడ ఇందుకు భిన్నంగా ఏకంగా ఐఏఎస్ అధికారి సంతకం ఉండటం అనుమానాలకు తావిస్తోంది. అంతేకాకుండా ఆయన ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న సమయంలో ఈ పత్రాన్ని జారీచేయడం కూడా మరిన్ని సందేహాలు తలెత్తే విధంగా ఉన్నాయి. మన ఘనత వహించిన జీవీఎంసీ ఇంజనీర్లు మాత్రం కనీసం ఈ పత్రం నిజమైనదా? కాదా? ఇందులో ఉన్న జెన్యూనిటీ ఎంత అనేది కనీసం విచారణ కూడా చేయకపోవడంపై మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సహజంగా టెండర్‌ను ఫైనల్ చేసే సమయంలో అక్కడి అధికారులతో ఒకసారి క్రాస్ చెక్ చేసుకుని మరీ తుది నిర్ణయం తీసుకోవడం సహజంగా జరిగే ప్రక్రియ. ఇక్కడ ఇటువంటిదేమీ జరగలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికే జీవీఎంసీలో క్లాప్ వాహనాలను నిర్వహించే సాయి పావని కన్‌స్ట్రక్షన్స్ సంస్థ మొత్తం వ్యవహారం నడిపినట్టు తెలుస్తోంది. జీవీఎంసీలోని మెకానికల్ విభాగంతో.. క్లాప్ వాహనాల్లో పెనవేసుకున్న బంధం కాస్తా బయో మైనింగ్ వరకూ సాగిందని అర్థమవుతోంది. ఇందులో కమిషనర్‌ను కూడా ఇరికించేందుకు పాత తేదీలతో తాజాగా బిల్లులు వంపడం గమనార్హం.

బయో మైనింగ్ అంటే...!

డంపింగ్ యార్డులో పేరుకుపోయిన భారీ వస్తువులను తీసివేసిన తర్వాత మిగిలిన వ్యర్థాలను బయో–స్టెబిలైజింగ్ ద్వారా కంపోస్ట్‌గా మారుస్తారు. తద్వారా 25 ఎకరాల భూమిని తిరిగి పొందవచ్చు. ఇది ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. వాస్తవానికి జీవీఎంసీ పరిధిలోని కాపులుప్పాడ వద్ద 2007లో డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల నుంచి వచ్చే వ్యర్థాలను ఇక్కడే డంప్ చేస్తున్నారు. తద్వారా ఇప్పటికే 60 శాతానికిపైగా భూమి వ్యర్థాలతో నిండిపోయింది. ఈ నేపథ్యంలో బయో మైనింగ్ ద్వారా 25 ఎకరాల భూమిని తిరిగి పొందేందుకు వీలుగా గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రక్రియను చేపట్టారు. తద్వారా 25 ఎకరాల భూమిని తిరిగి పొందే అవకాశం ఏర్పడింది. యార్డులో ఇంకా వ్యర్థాలు ఉన్నాయంటూ కూటమి ప్రభుత్వంలో మరోసారి రూ.2 కోట్లతో బయో మైనింగ్‌ను చేపట్టారు. ఈ కాంట్రాక్టును ఇప్పటికే జీవీఎంసీలో క్లాప్ వాహనాల కాంట్రాక్టును నిర్వహించే కాంట్రాక్టరే సాయి పవని సంస్థ పేరుతో చేపట్టినట్టు తెలుస్తోంది. ఇందుకోసం బయో మైనింగ్‌ను అగర్తాలో మునిసిపాలిటీలో చేపట్టినట్టు తప్పుడు ధృవీకరణ పత్రాలను సమర్పించి టెండరును దక్కించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈరోజు కాసేపు కనిపించను 'మామా!'



హలో మామా.. నేను మీ చందమామను. ఎలా ఉన్నారు.. మీరు బాగానే ఉంటారు. నేనైతే కాస్తా డల్‌గా ఉన్నాను. ఎందుకో మీలో చాలా మందికి తెలిసే ఉంటుంది. ప్రతి పౌర్ణమికీ వెలుగులు పంచే నేను ఈరోజు ఆ వెన్నెల అందివ్వలేనవే బాధతో ఉన్నాను. ఈరోజు రాత్రికి మీకు కనిపించను. ఎందుకంటే చంద్రగ్రహణం. భానుడుకి నాకు మధ్యలో మీ భూ గ్రహం వస్తోంది కదా. అన్నట్లు ఇది అత్యంత అరుదైన సంపూర్ణ చంద్రగ్రహణం. అది చెబుదామనే వచ్చాను.

చంద్రగ్రహణాలు మూడు రకాలుంటాయి. సంపూర్ణ , పాక్షిక, ఉపచ్ఛాయ చంద్రగ్రహణాలు. ఈ ఏడాదిలో రెండో సంపూర్ణ చంద్రగ్రహణం నేడు ఏర్పడుతోంది. ఈ గ్రహణం సుమారు 100 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే సంభవిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు మామా. చాలా చంద్ర గ్రహణాలు ఎంపిక చేసిన ప్రాంతాలలో మాత్రమే పాక్షికంగా కనిపిస్తాయి. కానీ ఈసారి 7 బిలియన్లకు పైగా ప్రజలకు కనిపిస్తుందదంట. ఈ తరహా ఖగోళ సంఘటన చాలా అరుదు అని శాస్త్రవేత్తలు మాట్లాడుతున్నారు మామా. మళ్లీ ఎన్నో దశాబ్దాల తర్వాత కానీ ఇలాంటి అద్భుతం కనిపించదంటున్నారు. అందుకే మీరు కూడా ఓ లుక్కెయ్యండి మామా.

అంతేకాదు.. ఈ సమయంలో నేను రుధిర వర్ణంలోకి మారుతానంట. నాకు తెలియదు. మీలాంటి సైంటిస్టులు చెబితే మీకు చెప్తున్నాను. ఎందుకంటే.. నేను అద్దం చూడలేను కదా. శాంపిల్‌గా ఈరోజు కూడా మీకు లైట్ బ్లడ్ కలర్‌లో కనిపిస్తున్నాను కదా. రేపు మరింత ఎరుపెక్కుతానంట. ఎందుకలా ఎరుపెక్కుతానో మీకు తెలుసా.. మామా..? చెప్తాను వినండి.

గ్రహణం సమయంలో నేను భూమి నీడ(ఉంబ్రా)లో ఉంటాను. దీంతో నేరుగా సూర్యకాంతి నన్ను చేరుకోదు. సూర్యకాంతిలో తక్కువ తరంగ దైర్ఘ్యం ఉన్న బ్లూ లైట్ చెల్లాచెదురైపోతుంది. కానీ ఎరుపు, ఆరెంజ్ రంగుల కాంతులు మాత్రం భూ వాతావరణంలోకి చొచ్చుకొని నా ఉపరితలానికి చేరుకుంటాయి. అందుకే బ్లడ్ మూన్‌లా కనిపిస్తానంట మామా.

భారత కాలమాన ప్రకారం ఆదివారం రాత్రి 9.58 గంటలకు గ్రహణం ప్రారంభమై సెప్టెంబర్ 8 తెల్లవారుజామున 1.26 గంటలకు ముగుస్తుంది మామా. కానీ ఈ అరుదైన బ్లడ్ మూన్ దృశ్యం మాత్రం రాత్రి 11.00 నుంచి 12.22 గంటల మధ్య స్పష్టంగా కనిపిస్తుందదంట. చూసి చెప్పండి.. నేను ఎలా ఉన్నానో..!

మీ..
మామా కాని మామ.. చందమామ.!

–సాక్షి, విశాఖపట్నం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా ఏడుగురికి చోటు

విశాఖ సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు(పార్లమెంట్)గా ఉమ్మడి విశాఖ జిల్లాలకు చెందిన ఏడుగురిని నియమించారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. అల్లూరి జిల్లాకు చెందిన గొట్టేటి మాధవిని రాష్ట్ర కార్యదర్శి(పార్లమెంట్)గా నియమిస్తూ ఆమెకు ఎస్.కోట, యలమంచిలి నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు. అలాగే అనకాపల్లి జిల్లాకు చెందిన దంతులూరి దిలీప్‌కుమార్‌రాజుకు చోడవరం, పెందుర్తి, పైలా శ్రీనివాసరావుకు మాడుగుల, పాయకరావుపేట, చిక్కాల రామారావుకు అనకాపల్లి, నర్సీపట్నం, చింతకాయల సన్యాసిపాత్రుడికి విశాఖ ఉత్తర, విశాఖ తూర్పు నియోజకవర్గాలను కేటాయించారు. అదే విధంగా విశాఖకు చెందిన చింతలపూడి వెంకటరామయ్యకు విశాఖ దక్షిణ, విశాఖ పశ్చిమ, తైనాల విజయ్‌కుమార్‌కు భీమిలి, గాజువాక నియోజకవర్గం బాధ్యతలు అప్పగించారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంలో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారులుగా వ్యవహరిస్తారు.

నేటి ఉదయం 11.30 గంటల వరకే అప్పన్న దర్శనం

సింహాచలం: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి దర్శనాలు ఉదయం 11.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయి. ఆ తరువాత రాజభోగం, రాత్రి ఆరాధన, పవళింపు సేవలు నిర్వహించి మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ కవాటబంధనం చేస్తారు. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని తిరిగి తెరచి, సంప్రోక్షణ పూజలు, హోమాలు నిర్వహిస్తారు. సుప్రభాత సేవ, ఆరాధనల అనంతరం ఉదయం 8 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారు.

రైతులకు అండగా 9న వైఎస్సార్ సీపీ పోరు

పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు • 'అన్నదాత పోరు'పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, చిత్రంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు గణేష్‌కుమార్, మొల్లి అప్పారావు, మాజీ మేయర్ హరి వెంకట కుమారి తదితరులు

విశాఖ సిటీ: రైతులకు మేలు చేయని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. యూరియా కొరత, ఇతర రైతాంగ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 9న 'ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు' పేరుతో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరతతో రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడడం దారుణమన్నారు. టీడీపీ నేతలు రేషన్ బియ్యం, ఇసుక, మద్యాన్ని వ్యాపారంగా చేసుకున్నారని, యూరియాను కూడా కమీషన్ కోసం రైతులను వేధిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఆర్బీకేల ద్వారా యూరియాను అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మొల్లి అప్పారావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్ల వరపు జాన్‌వెస్లీ, పేర్ల విజయచంద్ర, ఈర్ల అనూరాధ, పార్టీ నాయకులు జియ్యాని శ్రీధర్, అల్లంపల్లి రాజాబాబు, డాక్టర్ సి.ఎం.ఎ.జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీ వత్సవ్, రామన్న పాత్రుడు, పల్లా చిన్నతల్లి, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు అబంటి శైలేష్, పి.వి.సురేష్, పేడాడ రమణికుమారి, సనపల రవీంద్ర భరత్, కర్రి రామిరెడ్డి, రాయపురెడ్డి అనీల్‌కుమార్, వద్దాది దిలీప్‌కుమార్, బొండా ఉమామహేశ్వరరావు, దేవరకొండ మార్కండేయులు, నీలి రవి, జిల్లా పార్టీ కమిటీ నేతలు ముచ్చల సురేష్, ఆల్ఫా కృష్ణ, కార్పొరేటర్లు శశికళ, పద్మారెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు ఎం.డి.షరీఫ్, రాష్ట్ర, జిల్లా పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు బయ్యవరపు రాధ, బెందాళం పద్మావతి, శ్రీదేవి వర్మ, సూర్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం

- కూటమి పాలనపై 15 నెలల్లో ప్రజా వ్యతిరేకత
- సూపర్ సిక్స్ పేరుతో నయవంచన
- యూరియా కోసం రైతులు రోడ్లెక్కడం దారుణం
- రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం, డ్రగ్స్ గంజాయితో అఘాయిత్యాలు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి. చిత్రంలో విశాఖ, శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్లు సుభద్ర, పిరియా విజయ, విజయనగరం డిప్యూటీ మేయర్ శ్రావణి, మాజీ మేయర్ హరి వెంకట కుమారి, జోన్ ఇన్‌చార్జి అనురాధ, నగర మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి తదితరులు..

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం 15 నెలల్లోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి పేర్కొన్నారు. శనివారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జోన్–1 మహిళ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. అలాగే మహిళా విభాగాన్ని సంస్థాగతంగా పటిష్టం చేయాలని, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోడానికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని తీర్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలను, ముఖ్యంగా మహిళలను నిట్టనిలువుగా మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని చెప్పారు. ఎన్నికలకు ముందు అప్పటి సీఎం జగన్ కంటే ఎక్కువ మేలు చేస్తానని సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తర్వాత వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఎప్పుడూ చూడని విధంగా రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. కేంద్రం పూర్తి స్థాయిలో యూరియాను సరఫరా చేసినప్పటికీ వాటిని టీడీపీ నేతలు బ్లాక్ మార్కెట్ తరలించారని ఆరోపించారు.

ప్రజలకు రూ.81 వేల కోట్ల బకాయిలు

కూటమి ప్రభుత్వం రైతులకు మొదటి ఏడాది పెట్టుబడి సాయం ఎగ్గొట్టి వెన్నుపోటు పొడిచిందన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున ఇస్తానని చెప్పి ఒక్కో మహిళకు రూ.22,500 బాకీ పడిందని తెలిపారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు కింద ఇప్పటి వరకు రూ.45 వేలు బకాయి ఉందన్నారు. 50 ఏళ్ల దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వకపోగా కొత్తగా ఒక్కరికి పింఛను గానీ, రేషన్ కార్డు గానీ మంజూరు చేయలేదన్నారు. పైగా రాష్ట్రంలో 3 లక్షల మంది అర్హులైన వారి పెన్షన్ తొలగించిందని వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి 16 రకాల బస్సులు ఉంటే.. కేవలం 5 రకాల బస్సుల్లో ప్రయాణికులకు అవకాశం కల్పించారన్నారు. అలాగే ఉచితంగా మూడు సిలిండర్లు అని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. మెడికల్ కాలేజీలను సైతం బినామీలకు కట్టబెట్టేందుకు ప్రైవేటుపరం చేయాలని చంద్రబాబు నిర్ణయించారని ఆరోపించారు.

మహిళలకు రక్షణ లేదు: రాష్ట్రంలో హోం మంత్రిగా మహిళ ఉన్నప్పటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మద్యాన్ని విచ్చలవిడి చేసేసిందని విమర్శించారు. 80 వేల బెల్టుషాపులు పుట్టుకొచ్చాయని, పర్మిట్ రూమ్‌లకు కూడా అనుమతులు ఇచ్చేశారని తెలిపారు. మద్యం కారణంగానే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. అలాగే రాష్ట్రంలో డ్రగ్స్ డోర్ డెలివరీ జరుగుతోందని, గంజాయిని హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే పండిస్తున్నారని వివరించారు. వీటిని అరికట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. సీఎం నుంచి ఎమ్మెల్యేల వరకు అందరూ తమ స్వలాభం కోసం పనిచేస్తున్నారని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుడిలో ఉన్న దేవుడిని వెలివేసి మళ్లీ దేవుడు రావాలని ప్రార్థిస్తున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. రానున్న మూడేళ్లు ప్రజల తరఫున పోరాటం చేయడానికి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి, ఉత్తరాంధ్ర మహిళా విభాగం జోన్ ఇన్‌చార్జి ఈర్లె అనురాధ, కార్పొరేటర్లు, జోన్–1కు చెందిన మహిళా నాయకులు, రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డీఆర్సీలో సమస్యల వెల్లువ

- పారిశుధ్యం అధ్వానం, ఆగని ఆక్రమణలు
- వీధి దీపాల నిర్వహణ ఘోరం
- అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు
- విశాఖలో అభివృద్ధి పరుగులు పెట్టాలి: మంత్రి శ్రీబాల వీరాంజనేయ స్వామి

మహారాణిపేట: క్లీన్ సిటీ, స్మార్ట్ సిటీగా పేరున్న విశాఖ ఖ్యాతిని మరింత పెంచేలా అధికారులు పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణతో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా సమీక్ష మండలి(డీఆర్సీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర సుందరీకరణ, విద్యుదీకరణ, పట్టణీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

క్షేత్రస్థాయిలో పరిస్థితులు బాగోలేవు

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందడం లేదని పలువురు ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆక్రమణల క్రమబద్ధీకరణపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి మళ్లీ శిక్షణ ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. జీవీఎంసీలో కొందరు విధులకు రాకుండానే జీతాలు తీసుకుంటున్నారని ప్రస్తావించారు. డ్రైనేజీలు ఆక్రమణలకు గురయ్యాయని ఆరోపించారు. టీడీఆర్‌లు, ఆర్థిక నేరాల నియంత్రణ, బడ్స్ యాక్ట్ అమలు వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రధాన అంశాలు

- **ఎంపీ శ్రీ భరత్:** నగరంలో చాలా చోట్ల డ్రెయిన్లు ఆక్రమణకు గురయ్యాయి. వర్షపు నీరు రోడ్లపైకి వచ్చి చెత్త పేరుకుపోతోంది. దోమలు ప్రబలుతున్నాయి.

జీవీఎంసీ కమిషనర్: నగరంలో 250 ఆక్రమణలు గుర్తించాం. నెల రోజుల్లో చర్యలు తీసుకుంటాం.

- **ప్రభుత్వ విప్ గణబాబు:** పోర్టు, రైల్వే, డిఫెన్స్ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఒక కమిటీ వేసి సమస్యను పరిష్కరించాలి. కన్వేయన్స్ డీడ్ పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి.
- **ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు:** పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. సచివాలయ సిబ్బందిపై పర్యవేక్షణ లేదు. ముడసర్లోవ రిజర్వాయర్‌ను విస్తరించి, నగర నీటి నిల్వ సామర్థ్యాలను పెంచాలి.
- **ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు:** జీవీఎంసీలో ఆప్కాస్ ద్వారా నియామకాలు చేపట్టాలి. భూ సర్వేలో పారదర్శకత పెంచి, స్కెచ్ రూపంలో రిపోర్టులు ఇవ్వాలి. దువ్వాడ–కూర్మన్నపాలెం రోడ్డు విస్తరణ బాధితులకు టీడీఆర్‌లు అందించాలి. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను బలోపేతం చేయాలి.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా

- **ఎమ్మెల్యే వంశీకృష్ణ:** జీవీఎంసీ జోన్–4లో కొందరు విధులకు రాకుండానే జీతాలు తీసుకుంటున్నారు. దీనిపై జోనల్ కమిషనర్‌కు నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదు. సచివాలయాలకు కంప్యూటర్లు వంటి మౌలిక వసతులు కల్పించాలి. పారిశుధ్య నిర్వహణ బాగోలేదు.
- **ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు:** ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పినగాడి రోడ్డు సమస్యను వీఎంఆర్డీఏ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలి. నగరానికి సమీపంలోని కొన్ని గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలి.

మంత్రి స్పందన: ఈ ప్రతిపాదనను సబ్–కమిటీకి నివేదిస్తాం.

- **ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు:** టిడ్కో గృహాల బిల్లుల చెల్లింపులు, వసతుల కల్పన వేగవంతం చేయాలి. 26, 43, 46, 47 వార్డుల్లో ఉన్న 'ఘోస్ట్ వర్కర్ల'పై చర్యలు తీసుకోవాలి. తాడిచెట్లపాలెం–కంచరపాలెం మెట్టు మార్గంలో ఇప్పటికీ వీధి దీపాలు లేవు.

కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీసీపీ మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవోలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నవంబర్ నాటికి అనకాపల్లికి పోలవరం జలాలు

డీఆర్సీ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి డోలా

మహారాణిపేట: నవంబర్ నాటికి పోలవరం ఎడమ కాలువ నీటిని అనకాపల్లి వరకు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం డీఆర్సీ సమావేశం అనంతరం ఆయన కలెక్టరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించడానికి నగరంలోని నీటి నిల్వ ట్యాంకుల సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించామన్నారు. పోలవరం ఎడమ కాలువ నీటిని నిల్వ చేసేందుకు అదనపు ట్యాంకులను కూడా గుర్తించినట్లు తెలిపారు. వీధి దీపాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ప్రాజెక్టుల అమలును వేగవంతం చేసేందుకు రైల్వే, పోర్ట్, నేవీ, డాక్‌యార్డ్ అధికారులతో పాటు జిల్లా రెవెన్యూ అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయాల్లో ప్రింటర్ల కొరత ఉందని, దీనికి సంబంధించి ఇప్పటికే టెండర్లు పిలిచామని చెప్పారు. తాత్కాలిక పద్ధతిలో పారిశుధ్య కార్మికులను నియమించాలని ఆదేశాలిచ్చినట్లు వెల్లడించారు. జీవో నంబర్ 30, 45 విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ గత డీఆర్సీ సమావేశంలో తాను లేవనెత్తిన సమస్యలను ఇన్‌చార్జి మంత్రి పరిష్కరించారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్ హరేందిర ప్రసాద్ పాల్గొన్నారు.

అందుబాటులోకి డిజిటల్ న్యాయ సేవలు

విశాఖలో ఈ–సేవ కేంద్రం ప్రారంభం



ఈ సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు

విశాఖ లీగల్: న్యాయ ఫలాలను అందరికీ అందుబాటులో ఉంచడమే ఈ–సేవ కేంద్రాల లక్ష్యమని హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ప్రత్యేక ఈ–సేవ కేంద్రాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. న్యాయ సేవలను సత్వరమే కక్షిదారులకు అందించడమే ఈ కోర్టుల లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా దాపరికలేని సంపూర్ణ సమాచారాన్ని అందరూ పొందవచ్చని వివరించారు. న్యాయవ్యవస్థలో డిజిటల్ అంతరాన్ని తగ్గించి, న్యాయం అందరికీ అందుబాటులో ఉండేలా చేయడమే ఈ కేంద్రాల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ చల్ల గుణరాజన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, జిల్లాలోని పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జ్ ప్రారంభం

విశాఖ సిటీ: కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జ్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. రూ.7 కోట్లతో నిర్మించిన ఈ బ్రిడ్జ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్లాస్ బ్రిడ్జ్ పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. పీపీపీ విధానంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దీంతో ఈ గ్లాస్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. దేశంలోనే పొడవైన ఈ గ్లాస్ బ్రిడ్జ్ కేవలం విశాఖకే కాకుండా రాష్ట్రంలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆకాంక్షించారు. దీనిని ఈ నెల 25 తేదీలోగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కైలాసగిరిపై కొత్తగా ప్రారంభమైన జిప్‌లైనర్, స్కైసైక్లింగ్ పర్యాటకులకు కొత్త అనుభూతులను పంచుతున్నాయని, బ్రిడ్జ్ అందుబాటులోకి వస్తే విశాఖకే తలమానికంగా నిలుస్తుందన్నారు. విశాఖ కైలాసగిరిపై పర్యాటక ఆకర్షణలో భాగంగా ఇటీవలే సుమారు రూ.5.50 కోట్లతో త్రిశూలం ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

మైనార్టీ చేతి వృత్తిదారులకు 'ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన'

మహారాణిపేట: మైనార్టీ వర్గాలకు చెందిన చేతి వృత్తిదారుల ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బేగం తెలిపారు. ఈ పథకానికి 18 రకాల వృత్తులు చేసుకునేవారు అర్హులు. దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఉండాలి. కుటుంబం నుంచి ఒకరు మాత్రమే ఈ పథకానికి అర్హులని బేగం స్పష్టం చేశారు. మరింత సమాచారం కోసం 0891-2502271, 9849901159, 9441716209, 9100245438 సంప్రదించాలని ఆమె కోరారు.

విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: ఈ నెల 13వ తేదీన విశాఖపట్నంలో బయల్దేరనున్న విశాఖపట్నం-బ్రహ్మపూర్ (58532) పాసింజర్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 7, 14వ తేదీల్లో బ్రహ్మపూర్‌లో బయల్దేరనున్న బ్రహ్మపూర్-విశాఖపట్నం(58531) పాసింజర్‌లను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.











● గణపతి బప్పా మోరియా

గంగమ్మ ఒడికి గణనాథుడు

గణేష్ నవరాత్రులు ముగియడంతో శనివారం విశాఖలో గణనాథుని నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. నగరం నలుమూలల నుంచి వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు భారీ ఊరేగింపులతో గణపతి విగ్రహాలను తీరప్రాంతాలకు తరలించారు. ఈ ఊరేగింపుల్లో యువత ఉత్సాహంగా తీన్‌మార్ డ్యాన్స్‌లు చేస్తూ.. గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారికి వీడ్కోలు పలికారు. నిమజ్జనం కోసం జోడుగుళ్లపాలెం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయగా.. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నిబద్ధతకు నిలువెత్తు రూపం సత్యప్రసాద్

హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు

విశాఖ లీగల్: న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతిభావంతులైన న్యాయవాదులు ఎంతైనా అవసరమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. విశాఖలో నూతన న్యాయస్థాన సముదాయంలోని న్యాయవాదుల సంఘం భవనంలో శనివారం దివంగత సీనియర్ న్యాయవాది ఎస్వీ సత్యప్రసాద్ చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన న్యాయమూర్తులు ప్రసంగించారు. ముందుగా సత్యప్రసాద్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు మాట్లాడుతూ సత్యప్రసాద్ నిబద్ధతకు నిలువెత్తు రూపమని కొనియాడారు. మరో న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ మాట్లాడుతూ సత్యప్రసాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జస్టిస్ చల్లా కోదండరామయ్య, జస్టిస్ చీమలపాటి రవి... సత్యప్రసాద్‌తో ఉన్న అనుబంధాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్. సోమయాజులు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్. కృష్ణ మోహన్, విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కె. శ్రీనివాస్, లాలం పార్వతీనాయుడు, సీనియర్ న్యాయవాదులు నమ్మి సన్యాసిరావు, రామదాసు, శిష్టా శ్రీనివాసమూర్తి, కె.వి.రామ్మూర్తి, శివరాం, మీనాక్షి రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ కుటుంబ సభ్యులు విశాఖ న్యాయవాద సంఘం నూతన భవనానికి ఐదు లక్షల రూపాయల విలువ చేసే యంత్రాలను విరాళంగా అందించారు.



సత్య ప్రసాద్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ రఘునందన్‌రావు, జస్టిస్ చీమలపాటి రవి

'కమిటీ కుర్రాడి'కి సైమా అవార్డు

బెస్ట్ డెబ్యూ హీరోగా సందీప్ సరోజ్

కొమ్మాది: నగరంలోని మాధవధారకు చెందిన యువ నటుడు పేడాడ సందీప్ సరోజ్ అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవాన్ని పొందాడు. దుబాయ్‌లో అట్టహాసంగా జరిగిన సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్(సైమా-2025) వేడుకలో.. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంలో కనబరిచిన అద్భుత నటనకు గానూ బెస్ట్ డెబ్యూ హీరో అవార్డును అందుకున్నాడు. గ్రామీణ నేపథ్యంలో వచ్చిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం కమర్షియల్‌గా విజయం సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ఈ చిత్రంలో తన సహజమైన నటనతో సందీప్ ప్రేక్షకుల మన్ననలు పొందారు. ప్రతిష్టాత్మక సైమా అవార్డుల వేడుకలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమల నుంచి ప్రముఖులు పాల్గొనగా, వారి సమక్షంలో సందీప్ ఈ అవార్డును స్వీకరించడం విశేషం. ఈ పురస్కారంపై సందీప్ సరోజ్ స్పందిస్తూ.. 'తొలి సినిమాకే ఇంత పెద్ద గౌరవం దక్కడం నా బాధ్యతను మరింత పెంచింది. ఈ విజయం నా ఒక్కడిది కాదు. నాతో పాటు కష్టపడిన 11 మంది కుర్రాళ్లు, చిత్ర దర్శకుడు వంశీ, నిర్మాత నిహారిక, సాంకేతిక నిపుణులందరి కృషి ఫలితం ఇది. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని అన్నారు. సందీప్‌కు అవార్డు రావడం పట్ల అతని తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, నర్సింగరావు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమారుడు సినీ రంగంలో తొలి అడుగులోనే విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు.



సైమా అవార్డు అందుకున్న హీరో పేడాడ సందీప్ సరోజ్

'గ్రీన్ రైల్వే స్టేషన్'గా విశాఖకు ప్లాటినం సర్టిఫికెట్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో ఉన్న విశాఖ రైల్వే స్టేషన్ మరో అరుదైన ఘనత సాధించింది. పర్యావరణ పరిరక్షణలో అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తున్నందుకు గాను ఈ స్టేషన్‌కు ప్రతిష్టాత్మకమైన గ్రీన్ రైల్వే స్టేషన్ సర్టిఫికేషన్ (ప్లాటినం) లభించింది. గ్లోబల్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఈ సర్టిఫికెట్‌ను విశాఖ రైల్వే స్టేషన్‌కు అందజేయనుంది.విశాఖ రైల్వే స్టేషన్‌లో అమలు చేస్తున్న వివిధ పర్యావరణహిత పద్ధతులను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును ప్రకటించారు. ఇండియన్ రైల్వేస్‌లోని ఎన్విరాన్‌మెంట్ డైరెక్టరేట్, గ్లోబల్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ సహకారంతో ఈ రేటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఈ రేటింగ్‌లో భాగంగా ప్యాసింజర్ సౌకర్యాలు, నీటి వినియోగం, శాస్త్రీయ పారిశుధ్య పద్ధతులు, విద్యుత్ ఆదా, హానికరమైన ఆయిల్స్ వినియోగం తగ్గించడం వంటి అంశాలను తనిఖీ చేసి, అంచనా వేశారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ ఇది రైల్వే ఉద్యోగులందరి సమష్టి కృషి ఫలితమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్విరాన్‌మెంట్, హౌస్‌కీపింగ్ మేనేజ్‌మెంట్ సిబ్బంది పనితీరు అద్భుతమని అభినందించారు. విశాఖ రైల్వే స్టేషన్ భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



విశాఖ రైల్వేస్టేషన్‌కు దక్కిన గ్రీన్ రైల్వే స్టేషన్ సర్టిఫికెట్

ఆరుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



పర్యాటకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో ఆరుగురు పర్యాటకులు సముద్ర అలల తాకిడికి కొట్టుకుపోతుండగా, అప్రమత్తమైన లైఫ్‌గార్డ్స్ వారిని సురక్షితంగా రక్షించారు. శనివారం మధ్యాహ్నం ఛత్తీస్‌గఢ్ నుంచి ఎనిమిది మంది యువతీ యువకులు రుషికొండ బీచ్‌ను సందర్శించేందుకు వచ్చారు. సముద్రంలో స్నానానికి దిగినప్పుడు, అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో వారిలో గణేష్, మాన్సీ గోస్వామి, లోకేష్, ప్రియాంక, బాసు ప్రధాన్, అర్చల్ ప్రమాదంలో చిక్కుకున్నారు. అక్కడ విధుల్లో ఉన్న లైఫ్‌గార్డ్స్ ఈ విషయాన్ని గమనించారు. వేగంగా స్పందించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. తరువాత, మెరైన్ పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సురక్షితంగా వారి ఇంటికి పంపించారు. పర్యాటకుల ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

బోణీ కొట్టిన బుల్స్, జెయింట్స్



ఉత్కంఠగా సాగుతున్న పాట్నా పైరేట్స్, బెంగళూర్ బుల్స్ జట్ల మధ్య మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: నగరంలోని పోర్టు స్టేడియం కబడ్డీ.. కబడ్డీ నామస్మరణతో మార్మోగిపోతోంది. ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ స్థానిక క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. శనివారం జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లు ప్రేక్షకులను అలరించాయి. బెంగళూరు బుల్స్, గుజరాత్ జెయింట్స్ అద్భుత విజయాలు సాధించి పాయింట్ల ఖాతా తెరిచాయి. తొలి మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 38-30 తేడాతో పాట్నా పైరేట్స్‌ను కంగుతినిపించింది. ఇరుజట్లు నువ్వానేనా అన్నట్టు తలపడటంతో మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. బుల్స్ తరఫున అలీరెజా (10), ఆశిష్ (8) రైడింగ్‌లో అదరగొట్టగా, పాట్నా రైడర్ అయాన్ (10) పోరాడినా ఫలితం దక్కలేదు. మరో ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ జెయింట్స్ 37-28తో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. జెయింట్స్ ఆటగాళ్లు సమష్టిగా రాణించి విజయాన్ని అందుకున్నారు. ఆల్‌రౌండర్ నితిన్ పన్వర్ (8), కెప్టెన్ షాదులు (6) కీలక పాయింట్లతో జట్టును విజయపథాన నడిపించారు. ఆదివారం బెంగాల్ వారియర్స్‌తో తెలుగు టైటాన్స్ తలపడనుంది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ, జైపూర్ పింక్ పాంథర్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	:రూ.125
బ్రాయిలర్ (లైవ్)	:రూ.145
స్కిన్	:రూ.260
స్కిన్‌లెస్	:రూ.270

'కౌన్సిల్' లో పీలా గోవింద్ ఎలా కూర్చున్నారు?

ఆర్టీఐ కింద వివరణ కోరిన కార్పొరేటర్ సాధిక్

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో కార్పొరేటర్లతో కలసి కూర్చోవడంపై 39వ వార్డు కార్పొరేటర్ అయిన డాక్టర్ మహ్మద్ సాధిక్ ప్రశ్నించారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద ఆయన ఈ విషయమై వివరణ కోరారు. పీలా గోవింద్ కౌన్సిల్ సమావేశాలకు హాజరవ్వడానికి, కార్పొరేటర్లతో కలసి కూర్చోవడానికి ఏ నిబంధనలు లేదా ప్రభుత్వ ఉత్తర్వులు వర్తిస్తాయో తెలియజేయాలని సాధిక్ డిమాండ్ చేశారు. ఆయన ఎన్నికైన ప్రతినిధుల ముందు మూడు వరుసల్లో కూర్చోవడానికి అనుమతించే ఏదైనా ప్రత్యేక నిబంధన ఉందా అని అడిగారు. ఆయనకు ప్రభుత్వం నుంచి ఏదైనా అధికారిక అనుమతి పత్రం ఉంటే దాని కాపీని ఇవ్వాలని కోరారు. ఈ అనుమతి అన్ని సమావేశాలకు వర్తిస్తుందా లేదా ఏవైనా పరిమితులు ఉన్నాయా అని స్పష్టం చేయాలన్నారు. కౌన్సిల్‌లో నామినేటెడ్ కో-ఆప్టెడ్ సభ్యులు, మేయర్ లేదా ఇతర ప్రతినిధుల కుటుంబ సభ్యులు, అలాగే బయటి వ్యక్తులు కూర్చునేందుకు గల నిబంధనలను వివరించాలని కోరారు. కౌన్సిల్ సమావేశాలకు ఎవరు హాజరవ్వాలో నిర్ణయించే అధికారం ఎవరికి ఉంది, ఎన్నికైన ప్రతినిధుల సమ్మతి లేకుండా ఎవరైనా కూర్చోవచ్చా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఎవరినైనా కౌన్సిల్‌కు సలహాదారులుగా నియమిస్తే, వారు అధికారులతో కూర్చోవాలా లేక ఎన్నికైన ప్రతినిధులతో కూర్చోవాలా అని కూడా అడిగారు. కౌన్సిల్ సమావేశాల్లో పీలా గోవింద్ కూర్చునే స్థానం, ఇతర బయటి వ్యక్తుల హాజరుకు సంబంధించిన నిబంధనలపై స్పష్టత చేయాలని దరఖాస్తులో కోరారు.

నేత్రపర్వంగా అనంతుని జయంతి

పద్మనాభం: శ్రీ కుంతీ మాధవ స్వామి ఆలయంలో శనివారం అనంత పద్మనాభ స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కుంతీ మాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు పల్లకీలో తీసుకువచ్చి అధిష్ఠింపజేశారు. అలాగే శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి చిన్న ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొండపైకి తీసుకువెళ్లారు. ఉదయం 7 గంటలు, 10.30 గంటలకు జరిగిన వ్రతాల్లో మొత్తం 160 మంది దంపతులు పాల్గొన్నారు. కొండపై ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు కూడా నిర్వహించారు. కొండ కింద ఉన్న కుంతీ మాధవ స్వామి, కొండపై ఉన్న అనంత పద్మనాభ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకల్లో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, సర్పంచ్ తాలాడ పాప, పద్మనాభంతో పాటు విశాఖపట్నం, సింహాచలం, విజయనగరం వంటి దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి.. అనంత పద్మనాభ స్వామిని కనులారా వీక్షించారు.



గిరిపై ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అనంతుని స్వయంభూ విగ్రహం

'బాలు'కు బళ్లారి రాఘవ అవార్డు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామానికి చెందిన సీనియర్ రంగస్థల నటుడు సామవేదం బాలసుబ్రహ్మణ్యం (బాలు) శనివారం నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ జాతీయ పురస్కారం అందుకున్నారు. కర్నాటక రాష్ట్రం బళ్లారిలో బీపీఎస్‌వీ కళాశాల శరవణా ఆడిటోరియంలో బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ బాలుకు ఈ అవార్డు అందజేసింది. అసోయేషన్ తరఫున బళ్లారి రాఘవ మనుమడు, అనంతపురం డిప్యూటీ కలెక్టర్ రాఘునాథ్ తదితరులు బాలును సత్కరించారు.



బళ్లారి రాఘవ అవార్డు అందుకున్న బాలు

విశాఖలో బహుజనగణమన ఆవిష్కరణ

అల్లిపురం: బీసీల హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి వివిధ వర్గాల నుంచి మద్దతు కోరుతూ పలువురు బీసీ ఉద్యమకారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగరంలో జరిగిన కార్యక్రమాలలో కవి జూలూరు గౌరీశంకర్ రచించిన 'బహుజనగణమన' దీర్ఘకావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే, సర్దార్ గౌతులచ్చన్న విగ్రహాల వద్ద , ఆర్.కె. బీచ్‌లోని జాలాది విగ్రహం వద్ద జరిగింది. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, తొలి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ రాసిన ఈ కావ్యాన్ని మాజీ వీసీ కే.ఎస్. చలం, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గోడి నరసింహాచారి, బీసీ స్టడీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేంకటేశ్వరరావు, రచయిత్రి జాలాది విజయ, అరసం నాయకులు ఉప్పల అప్పలరాజు, శ్యామసుందర్, స్ట్రగుల్ ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా అధ్యక్షులు సుబ్బారావు గౌడ్ తదితరులు ఆవిష్కరించారు.

కవులారా మీరెటువైపు? నుంచి బహుజనగణమన వరకు

ఈ సందర్భంగా మాజీ వీసీ కే.ఎస్. చలం మాట్లాడుతూ విశాఖ విద్యార్థులు శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంగా వేసిన 'కవులారా మీరెటువైపు?' కరపత్రం విప్లవ కవిత్వానికి ఎలా దారి తీసిందో గుర్తు చేశారు. ఇప్పుడు జూలూరు రాసిన 'బహుజనగణమన' కావ్యం బహుజన ఉద్యమానికి ఒక డిక్లరేషన్ లాంటిదని పేర్కొన్నారు. గోడి నరసింహాచారి మాట్లాడుతూ, 1970లలో దిగంబర కవులు తమ కవిత్వాన్ని రిక్షా కార్మికుడి చేత ఆవిష్కరింపజేసిన విధంగానే, ఇప్పుడు జూలూరు కావ్యాన్ని పలు చేతివృత్తుల వారి చేత ఆవిష్కరింపజేయడం ఒక నూతన అధ్యాయానికి నాంది పలికిందన్నారు. కావ్యకర్త జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ తరతరాల అణిచివేతకు గురైన బీసీల హక్కులు, సామాజిక న్యాయం అనే అంశాలను ప్రధానంగా తీసుకుని ఈ కావ్యాన్ని రచించినట్లు తెలిపారు.

కులవృత్తుల చేత పుస్తకావిష్కరణ

జీవీఎంసీ 38వ వార్డులో పలు కులవృత్తులు, చేతివృత్తుల వారి చేత ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం వినూత్నంగా నిర్వహించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్

కంబాలకొండలో నిలిచిపోయిన బోటింగ్



ఒడ్డున బోట్లు

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక కేంద్రం కంబాలకొండ ఎకోటూరిజం పార్కు ఇప్పుడు కళ తప్పింది. పర్యాటకులకు ఎంతో ఆనందాన్నిచ్చే బోటింగ్ సౌకర్యం నిలిచిపోవడంతో సందర్శకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. సాధారణంగా దట్టమైన కొండల నుంచి వచ్చే వర్షపు నీటితో నిండి ఉండే దేగల గెడ్డగా పిలవబడే ఈ కొలను.. ఈ ఏడాది సరిపడినంత వర్షాలు లేకపోవడంతో పూర్తిగా అడుగంటిపోయింది. అడుగు భాగంలో అక్కడక్కడ మట్టి దిబ్బలు స్పష్టంగా కనిపిస్తుండటంతో బోటింగ్‌కు వీలుపడటం లేదు. దీంతో పార్కులో ఉన్న కయాక్స్, ఫ్యామిలీ బోట్లు, ఇతర బోట్లు అన్నీ ఒడ్డుకే పరిమితమయ్యాయి. దాదాపు మూడు నెలల నుంచి పర్యాటకులు ఇక్కడ బోటింగ్ చేసే అవకాశం కోల్పోయారు. గతంలో ఆగస్టు నెలలో ఈ కొలను నిండి ప్రవహించేది. అయితే ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో కొలనులో నీరు చేరలేదు.